క్లుప్తంగా

గ్రామాల్లో పనుల జాతర

భూపాలపల్లి రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు గ్రామాల్లో పనుల జాతర కార్యక్రమాలు నిర్వహించినట్లు డీఆర్‌డీఓ బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తదితర అధికారులు పాల్గొన్నారని చెప్పారు.

కమిటీ ఎన్నిక



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో కుమ్మర సంఘం మండల సంఘం ఇన్‌చార్జ్ కోడూరి లింగయ్య, జిల్లా బాధ్యులు ఇటుకాల రమేశ్, కాసర్ల మల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కుమ్మర సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాడిచర్ల గ్రామానికి చెందిన యాషాడపు ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పోతుగంటి రమేశ్‌లను ఏకగ్రీవంగా ఎనున్నకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా చెన్నూరి దేవదానం, యాషాడపు సతీష్ , కోశాధికారిగా చెన్నూరి సంతోష్, కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల కుమ్మర సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను స్థానిక హోంగార్డ్స్ పరామర్శించారు. ముత్యాల మొగిలి, బానోత్ సీతారాంనాయక్, దేవేందర్, మచ్చ రామస్వామి, బొజ్జపల్లి రాకేశ్, రాజయ్య, గంగ రాజు, శ్రీనివాస్, కుమారస్వామి, రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

కాళేశ్వరం: వరదలతో నీట మునిగి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బుడే శేఖర్ అన్నారు. మహదేవపూర్ మండలంలో అన్నారం, చంద్రుపల్లి గ్రామాల్లో వరద నీట మునిగిన పత్తిపంటలను బీజేపీ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. ప్రాంతంలో గోదావరి పొడవునా కరకట్ట నిర్మించాలని డిమాండ్ చేశారు. నీటమునిగిన పత్తి పంటకు ఎకరానికి రూ.50వేలు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, అటు చెన్నూర్ ఎమ్మెల్యేగా గడ్డం వివేక్‌లు మంత్రులుగా ఉన్నారని రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లం కిషన్, కార్యదర్శి గోర శ్రీకాంత్, అన్నారం గ్రామశాఖ అధ్యక్షుడు ముల్కల నరేందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు గోక లక్ష్మణ్, బండం ఆదిరెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

మేకల కాపరి మృతి



మొగుళ్లపల్లి: మేకల కాపరి మృతి చెందిన మండలంలోని పోతుగల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన మేకల కాపరి నాంపల్లి కొమురయ్య (55) రోజువారి లాగే మేకలను మేత మెపడానికి తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులో మేకలను మేపుతుండగా ఒక్కసారిగా కుప్పకులాడు. దీంతో చుట్టుపక్కల వారు గమనించి చూసే సరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు.

అలంకారప్రాయంగా భవనం



నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్

- నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు
- ప్రారంభించినా తెరుచుకోని భవనం
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం నిర్మించి రెండు సంవత్సరాలకు పైగా అవుతున్నా నేటికీ నిరుపయోగంగానే ఉంది. దీంతో భవనం ముందు పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కమ్యూనిటీ హాల్ భవనంలో ఏర్పాటు చేసుకోవాల్సిన సమావేశాలు మండల కేంద్రంలోని చౌరస్తాలో నిర్వహించుకుంటున్నారు. మండల కేంద్రంలో రూ.25లక్షల నిధులతో కమ్యూనిటీ హాల్ భవనాన్ని కాంట్రాక్టర్ నిర్మించారు. ఈ మేరకు 2023 మే నెలలో భవనాన్ని ప్రారంభించారు. కానీ ఇప్పటికీ ఆ భవనం తెరుచుకోలేదు. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించిన భవనాన్ని నిరుపయోగంగా ఉంచడం ఏంటని పలు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నిధులు చెల్లించకపోవడంతో తెరుచుకోవడం లేదని తెలిసింది. దీంతో ఆ భవనం అలంకారప్రాయంగా మిగిలిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కమ్యూనిటీ హాల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

భవనం అప్పగించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటి హాల్ భవనాన్ని స్థానికులకు అప్పగించాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలానికి వచ్చిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్, జెడ్పీ సీఈఓ, సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడారు. భవనాన్ని అప్పగించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు యుగేందర్ తెలిపారు.

భవనాన్ని అప్పగించాలి



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం నిరుపయోగంగా ఉంది. అంబేడ్కర్ యువజన సంఘాల సమావేశాలు ఏమైనా నిర్వహించుకోవాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని అప్పగించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన కమ్యూనిటీ హాల్‌ను అంబేడ్కర్ యువజన సంఘం నాయకులకు అప్పగించాలి.

- యుగేందర్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు

ఒక్క రూపాయి రాలే..

కమ్యూనిటీ హాల్ భవనం రూ.25 లక్షలతో నిర్మించా. కనీసం అధికారులు ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఇప్పటి వరకు ఇటువైపు చూసిన దాఖలాలు లేవు. అప్పులు తీసుకొచ్చి నిర్మించినా అధికారులు కనీసం ఎంబీ చేయలేదు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలి.

- తౌటం నవీన్, కాంట్రాక్టర్

ఎడ్ల పండుగ..

- నేడు పొలాల అమావాస్య
- గ్రామాల్లో ప్రత్యేకంగా ఎడ్లకు పూజలు



కాళేశ్వరంలో పొలాల అమావాస్య రోజున ఎద్దులను పూజిస్తున్న కుటుంబం(ఫైల్)

కాళేశ్వరం: ప్రేమతో నిమిరితే మూగగా చూస్తాయి. కాడి కట్టగానే దుక్కి దున్నుతాయి, కరువొచ్చినా... కాలం కాకపోయిన కలిసి బతుకుతాయి. అన్నదాతకు సాగులో తోడుండే అలాంటి మూగజీవాలను కొలిచే అరుదైన పండగ పొలాల అమావాస్య. మన సంస్కృతి, సంప్రదాయాలకు పొలాల అద్దంపడుతుంది. ప్రతి ఏడు శ్రావణ మాసంలో చివరి రోజున వచ్చే అమావాస్యను పొలాల అమావాస్యగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. (నేడు) శనివారం పొలాల పండుగ నిర్వహించుకోనుండగా పల్లెల్లో సందడి కనిపిస్తుంది.

మన సంస్కృతి.. మన పండుగ

సంస్కృతిని ప్రతిబింబించే ఈ పండుగను జిల్లా నలుమూలల ఉత్సవంగా నిర్వహించుకుంటారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ పండుగను జిల్లాలో వైభవంగా చేసుకుంటారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో జరుపుకునే «పొలా»ను సరిహద్దులోని మన జిల్లాలో ‘పొలాల’గా జరుపుకుంటారు. నాడు ఈ ప్రాంతాన్ని మహారాష్ట్రలోని చాందా (చంద్రపూర్) కేంద్రంగా గోండు రాజులు పాలించే వారు. కొన్నాళ్ల తరువాత విడిపోయినప్పటికీ మరాఠీ సంస్కృతి, సంప్రదాయాలను ఇక్కడి ప్రజలు అట్టిపెట్టుకునే ఉన్నారు. మరాఠి మాట్లాడటం, పొలాల, తీజ్ లాంటి పండుగలను నిర్వహించుకోవడం కొనసాగుతూనే ఉంది.

ఎడ్లకు ప్రత్యేక పూజలు

ఆరుగాలం శ్రమించే రైతులకు బాసటగా నిలిచే ఎడ్లకు పూజలు చేసే పొలాల అమావాస్య వేడుకలు జిల్లాలో కోలాహలంగా సాగుతాయి. పొలాల రోజు ఎద్దులకు ఎలాంటి పనులు చెప్పకుండా.. భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఎడ్లను శుభ్రంగా కడిగి వాటిని అందంగా అలంకరిస్తారు. పూల దండలు, గజ్జెలు, కొత్త కన్నాలతో ముస్తాబు చేసిన బసవన్నలను స్థానికంగా ఉండే ఆలయాలకు తీసుకువెళ్తారు. గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని దేవుళ్లను రైతులు వేడుకుంటారు. సాయంత్రానికి గ్రామాల్లో ఎద్దులను ఊరేగిస్తారు. అనంతరం ఇంటికి తీసుకువచ్చి హారతి ఇస్తారు. మరుసటి రోజు రైతులు తమ ఇళ్లల్లో మట్టితో చేసిన ఎద్దుల ప్రతిమలు పెట్టుకుని పూజిస్తారు. రైతులే కాకుండా వ్యవసాయేతర కుటుంబాలు సైతం ఈ పూజల్లో పాల్గొంటారు.

నేడు సమావేశం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నేడు (శనివారం) మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో, కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సై అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల్లో నియమ నిబంధల గూర్చి పోలీస్ స్టేషన్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తప్పకుండా హాజరు కావలన్నారు.

కోటగుళ్లలో పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

గణపురం: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే పెద్దసంఖ్యలో తరలివచ్చి గణపేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నిజామాబాద్ సీపీ పోతరాజు సాయి చైతన్య కీర్తి దంపతులు అందించిన పట్టువస్త్రాలతో స్వామి వారిని భవాని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- సీఐ కురుణాకర్ రావు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ

గణపురం: ఎరవుల దుకాణాల నిర్వాహకులు అధిక ధరలకు విక్రయించడానికి యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ కురుణాకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎస్సై రేఖ అశోక్‌తో కలసి పరిశీలించారు. ఎరువుల విక్రయ కేంద్రంలో యూరియా ఎంత నిల్వ ఉందని ఏఓ అయిలయ్యను అడిగి తెలుసుకున్నారు.

‘అక్రమ అరెస్టులు అమానుషం’



కాటారం: పోలీస్ స్టేషన్‌లో నాయకులు



మల్హర్‌లో..

కాటారం: మార్వాడీ గో బ్యాక్‌ను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సెక్రటరియెట్ ముట్టడి నే పథ్యంలో పార్టీ మండల నాయకుల ముందస్తు అరెస్ట్ అమానుషం అని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మన భాస్కర్‌రెడ్డి అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమను పోలీసులు స్టేషన్‌లో ఉంచడం సరికాదన్నారు. గో బ్యాక్ మార్వాడీ అనే నకిలి ఉద్యమం నడుస్తుందని, ఒక వర్గం ప్రోత్సహించి వారి ఓటు బ్యాంకు కోసం హిందువులను విడదీయాలనే కుట్ర జరుగుతుందని ఆరోపించారు.

మల్హర్: మార్వడి గోబ్యాక్‌ను ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడి పిలుపు నివ్వడంతో శుక్రవారం ఆ పార్టీ మండల నాయకులను కొయ్యూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి సేష్టన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్ ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు సభావత్ నాగరాజు చౌహాన్, మండల ప్రధాన కార్యదర్శి వెన్నపురెడ్డి తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు వేమునూరి సతీశ్‌రెడ్డి, తోటపల్లి మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



రేగొండ: అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.12 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆయకట్ట వరకు గ్రావెల్ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోచమ్మ గుడి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డీఆర్డీఓ బాలకృష్ణ, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు పున్నం రవి, రవీందర్ రెడ్డి, గండి తిరుపతి, ఎడ్ల మల్లారెడ్డి, వీరబ్రహ్మం, భిక్షపతి, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువులకు సంబంధించిన కాలువల మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. పలు సమస్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాయితీ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేగొండ(కొత్తపల్లిగోరి)/చిట్యాల/గణపురం: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2005–26 సంవత్సరానికి గాను 50శాతం సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పనిముట్లు అందజేస్తుందని కొత్తపల్లిగో, చిట్యాల, గణపురం ఏఓలు సారయ్య, శ్రీనివాస్ రెడ్డి, అయిలయ్య శుక్రవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళా, చిన్నకారు, సన్నకారు మహిళా రైతులకు అవకాశం ఉందని సెప్టెంబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికారాలైతే ఆర్‌సీని ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ పథకం ద్వారా బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, రోటవేటర్స్, కల్టివేటర్స్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్, స్ట్రాబేలర్ కేటాయించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రేగొండ: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించారు. కాల్వపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎండారపు కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరిధి దాటినా.. పట్టింపేది?



అక్రమంగా పరిధి దాటి తరలిస్తున్న ఇసుక

రేగొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం టేకుమట్ల మండల కేంద్రంతో పాటు రాఘవరెడ్డిపేట, కలికోట ప్రాంతాల నుంచి ఇసుకను నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సరఫరా చేయాలని అధికారులు సూచించారు. దూరాన్ని బట్టి ధరలను కూడా నిర్ణయించారు. కాని వాటన్నింటిని తుంగలో తొక్కుతూ ఇసుక సరఫరా చేసేవారు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. టేకుమట్ల నుంచి రేగొండకు రూ.3వేలు, కొత్తపల్లిగోరి మండలానికి రూ.3500 లుగా అధికారులు ధరను నిర్ణయించారు. కానీ ఇసుక ట్రాక్టర్ యాజమానులు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వసులూ చేస్తున్నారు. అలాగే టేకుమట్ల నుంచి తరలించే ఇసుకను నియోజకవర్గంలోని గ్రామాలకు మాత్రమే పంపిణీ చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. కానీ ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇసుకను పరకాల, మల్లంపల్లి, ములుగు వంటి ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. నియోజకవర్గంలోని గ్రామాలకు ఇసుకను తరలించడానికి పర్మిషన్ తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తే అధిక డబ్బులు వస్తుండటంతో నియోజకవర్గం పరిధి దాటి ఇసుకను తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్ణయించిన ధరలకే ఇసుక సరఫరా చేయాలని గృహ నిర్మాణస్తులు కోరుతున్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

భూపాలపల్లి రూరల్: ఇందిరాపార్క్ వద్ద సెప్టెంబర్ 1న చేపట్టనున్న మహాధర్నా పోస్టర్‌ను పీఆర్‌టీయూ(టీఎస్) జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి శుక్రవారం భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందల రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వొల్లల రాజు, భూపాలపల్లి మండల అధ్యక్షుడు కొండపర్తి హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి తౌటం స్వామి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మార్కెట్ చైర్‌పర్సన్ తిరుమల



కాటారం: పనుల జాతరను ప్రారంభిస్తున్న తిరుమల



తాడిచర్లలో మరగుదొడ్డి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రమేశ్

కాటారం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని కాటారం ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల అన్నారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా కాటారం గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం చైర్‌పర్సన్ భూమి పూజ చేశారు. మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో పనుల జాతరలో భాగంగా పలు అభివృద్ధి పనులను అధికారులు ప్రారంభించారు. కాటారం జీపీ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పనుల జాతరతో పల్లెల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, ఏపీఓ వెంకన్న, పంచాయితీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, కరుణాకర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి జాతర పనులు ప్రారంభం

మల్హర్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి జాతర అభివృద్ధి పనులను శుక్రవారం అధికారులు ప్రారంభించారు. మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీలో మంజూరైన సామూహిక మరుగుదొడ్డి సముదాయాన్ని రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలోని వ్యక్తిగత పనులు, హార్టికల్చర్, ప్లాంటేషన్, క్యాటిల్ షెడ్స్, గోట్ షెడ్స్, పౌల్ట్రీ ఫామ్స్, పంట పొలాలకు రోడ్డు పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో దండు రమేశ్‌ను అధికారులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య, డైరెక్టర్ వొన్న తిరుపతిరావు, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, ఏపీఓ గిరీ. హరీష్, ఈసీ మంగీలాల్, గ్రామ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పలిమెల: పనుల జాతరలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ సోప్ పిట్స్, వ్యక్తిగత సోప్ పిట్స్, కామన్ సానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు మండల అధికారులు ముగ్గు పోశారు. అనంతరం ఉపాధి హామీ కూలీలల్లో, బీపీ సిబ్బందిలో బాగా పనిచేసిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి క్రాంతి కిరణ్, ఎంపీడీఓ చల్ల ప్రకాశ్‌రెడ్డి, ఏపీడీ మంజుల, ఇంజనీరింగ్ అధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, పీటర్ పాల్, వినయ్‌కృష్ణ, రాంబాబు, టెక్నికల్ సిబ్బంది సాంబశివరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు స్వరూప పాల్గొన్నారు.

సన్మానం



సురేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ప్రముఖ సీనియర్ జానపద కళాకారుడు బల్లి సురేందర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు దేవన్ సన్మానించారు. ఈ సందర్భంగా దేవన్ మాట్లాడుతూ.. మన సాంస్కృతి, సంప్రదాయాలను యావత్ ప్రపంచానికి జానా పదాలు చాటుతున్నాయన్నారు. స్థానిక జానాపద కళాకారులను అందరూ ఆదరించి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేశ్, కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య పాల్గొన్నారు.